విశాలాంధ్ర
ప్రకాశం బాపట్ల
మంగళవారం 11 మార్చి 2025 8 పేజీలు

విద్యావ్యవస్థ అస్తవ్యస్తం

వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి

- వైసీపీ 'యువత పోరు'ను జయప్రదం చేయండి
- విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్, ఉపకారవేతనాలు విడుదల చేయాలి
- యువతకు ఉద్యోగ కల్పనలో కూటమి ప్రభుత్వం విఫలం
- నెలకు రూ.3 వేలు వంతున నిరుద్యోగ భృతి ఇవ్వాలి
- ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తాం..
- వెలిగొండ ప్రాజెక్టుకు టీడీపీ చేసింది శూన్యం

విశాలాంధ్ర -ఒంగోలు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని దర్శి ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగ యువతకు వెంటనే ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12వ తేదీన వైసీపీ ఆధ్వర్యంలో ఒంగోలులో నిర్వహించే యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. ఒంగోలులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో బూచేపల్లి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య వ్యవస్థను గాలికి అన్నారు. విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్లను విడుదల చేసేందుకు తగిన స్థాయిలో రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీని మరిచారన్నారు. ఉద్యోగం ఇవ్వలేకపోతే నెలకు రూ. 3వేలు నిరుద్యోగ భృతి ఇస్తానని ఇచ్చిన హామీని గాలికి వదిలేసారు అన్నారు. రాష్ట్రానికి గత ముఖ్యమంత్రి జగన్ 17 మెడికల్ కాలేజీలు తీసుకువస్తే, వాటిలో ఐదు మెడికల్ కాలేజీలు పూర్తయి నడుస్తుండగా, నిర్మాణంలో ఉన్న మిగిలిన 12 మెడికల్ మిగతా 2 లో ...

అర్జీల పరిష్కారానికి అధికారులు బాధ్యతతో పనిచేయాలి

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వచ్చే ఆర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశ మందిరంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల క్రిష్ణ, జిల్లా రెవెన్యు అధికారి చిన ఓబులేసులతో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఆర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పని చేయాలన్నారు. ప్రతీ అర్జీకి అర్ధవంతమైన సమాదానం ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్, అధికారులను ఆదేశించారు. ప్రతీ అర్జీని ఆడిటింగ్ చేయడం జరుగుతుందని, అర్జీల పరిష్కారంలో క్షేత్ర స్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో 237 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో జనాభా ప్రాతిపదికన

రిజర్వేషన్లు అమలు చేయాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య డిమాండ్

విశాలాంధ్ర-ఒంగోలు : ఎస్సీ వర్గీకరణను జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బ్రహ్మయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు మూలం చంద్రబాబు నాయుడు అన్నారు. ఎస్సీ రిజర్వేషన్లు ఏ,బి,సి,డిలుగా వర్గీకరించాలని 1994లో ఉద్యమం ఏర్పడటం జరిగిందన్నారు. 1996 సంవత్సరము చంద్రబాబు ప్రభుత్వం రామచంద్రరాజు కమీషన్ ఏర్పాటు చేయడం, కమీషన్‌జనాభా దామాషా ప్రకారం యస్సీలను ఏ,బి,సి,డిలుగా వర్గీకరించాలని నివేదిక సమర్పించడం, రామచంద్రరాజు కమీషన్ ప్రామాణికంగా వర్గీకరణ అమలు కావడం జరిగిందన్నారు. అలాగే 2007లో వేసిన ఉషా మెహరా కమీషన్ జనాభా దామాషా ప్రకారం యస్సీ వర్గీకరణ జరగాలనికేంద్రానికి నివేదిక సమర్పించినదన్నారు. ప్రస్తుతం యస్సీ వర్గీకరణను రాష్ట్రాలే అమలు చేసుకోవచ్చని 1 ఆగస్ట్ 2024న సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తరువాత ఆంధ్రప్రదేశ్లో నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమీషను కూడా పై కమీషన్ నివేదికలను దృష్టిలో ఉంచుకొని జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ జరపాలని రాష్ట్ర వ్యాప్తంగా వినతి ప్రతాలు ఇవ్వటం జరిగిందన్నారు. ఆనాడు యస్సీ జనాభా 1,38,78,078, మాల మాదిగల జనాభా సంఖ్య 1,22,72,853 మంది. అందులో మాదిగలు 67,02,609, మాలలు 55,70,853 మంది, ఉప కులాలు 1,65,205. మాలలు కన్నా మాదిగలు 11,32,365 మంది ఎక్కువయినా రామచంద్రరాజు కమీషన్ ఆనాటి జనాభా దామాషా ప్రకారం 15 శాతం రిజర్వేషన్లను ఎ1, బి7, సి6, డి1లుగా కేటాయించడం జరిగిందన్నారు. ఆనాడు ఇదే చంద్రబాబు జిల్లా యూనిట్ మిగతా 2 లో ...

మహిళల ఆర్థికాభివృద్ధికి చంద్రన్న అడుగులు

బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు

విశాలాంధ్ర - బాపట్ల : మహిళలని ఆర్థికంగా వృద్ధిచేసేందుకు స్వశక్తితో నిలబడేలా డ్వాక్రా సంఘాలను సీఎం చంద్రబాబు ఏర్పాటు చేసి మానసిక ధైర్యాన్ని పెంపొందించారని బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు తెలిపారు. ఆయన కార్యాలయంలో సోమవారం సాయంత్రం మీడియాతో మాట్లాడుతూ మహిళలకు అత్యధిక గౌరవం ఇచ్చే పార్టీ తెలుగుదేశం అని తొలి తెలుగు మహిళా స్పీకర్ అభ్యర్థిత్వాన్ని ఎంపిక చేసిన ఘనత టిడిపికే దక్కిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళల కోసం అనేక పథకాలను రూపొందించిందన్నారు. మహిళా సంక్షేమం సాధికారత కోసం వివిధ సంస్థలతో అవగాహన కుదుర్చుకొని అనేక పథకాలు కార్యక్రమాలను ప్రారంభించిందన్నారు. లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడమే లక్ష్యంగా సెర్ఫ్ మెప్మా ఎంఎస్ఎం రంగాలలో మహిళల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఇందుకు సంబంధించి ప్రకటన సీఎం చంద్రబాబు విడుదల చేశారన్నారు. మెప్మాలో 30 వేల మంది రాపిడ్‌లో 10 వేల మహిళలు స్వయం ఉపాధి పథకంలో 4 వేలు, టూరిజం సంబంధిత రంగాల్లో 4 వేలు, తృప్తి హోటల్లో 4 వేలు, స్మార్ట్ స్టేట్స్ వెండింగ్ జోన్లలో 2 వేలమంది, టిట్ కో లైవ్లీహుడ్ సెంటర్లలో మరో రెండు వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. వ్యవసాయ అధికారిక తయారీ యూనిట్లు, సేవారంగం వ్యాపారాల్లో మహిళలకు జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసిందన్నారు. 2025-26 సంవత్సరానికి ఎంఎస్ఎం రంగంలో 10 వేల మందికి జీవనోపాధి కల్పించేందుకు కార్యచరణను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మహిళలు పిల్లల భద్రత కోసం సీఎం చంద్రబాబు శక్తి బృందాలను ప్రారంభించారన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, చిన్నారులపై వేధింపులను నిరోధించడమే ప్రధాన లక్ష్యంగా శక్తి బృందాలు పనిచేస్తున్నాయన్నారు. నేరాలను అరికట్టడం తక్షణ సహాయం అందించడంతో పాటు వారికి రక్షణ కవచన్ల శక్తి బృందాలు ఉంటాయన్నారు. చేనేతరంగాన్ని పరుగులు పెట్టించేందుకు ముఖ్యమంత్రి చేనేత రథాలను ప్రారంభించారని వీటి ద్వారా చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించాలని నిర్ణయించారన్నారు. ప్రతి జిల్లాకు రూ.60 లక్షలు కేటాయించి చేనేత ఉత్పత్తులు విక్రయం మరింత సులభతరం కానుందని ప్రతి చేనేత మహిళకు 36 చీరలు నేసే నూలును ఉచితంగా పంపిణీ చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 50 వేల మంది మహిళలకు మిగతా 2 లో ...

డీఎంఅండ్‌హెచ్‌ఓతో 'వినుకొండ' భేటీ

విశాలాంధ్ర-ఒంగోలు : వైద్య ఆరోగ్య శాఖలో సేవా తత్పరుడుగా పేరు గడించిన డాక్టర్ టి.వెంకటేశ్వర్లుని ప్రకాశం జిల్లా వైద్యాధికారిగా నియమించడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వినుకొండ రాజారావు పేర్కొన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ప్రకాశం జిల్లాలో ఆరోగ్య సేవలను విస్తృతపరచడానికి జిల్లా మీద పట్టు ఉండి, ఎంతో అనుభవజ్ఞులైన టి.వెంకటేశ్వర్లుని ఒంగోలు డియంహెచ్‌ఓ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా వినుకొండ రాజారావు కలిశారు. ఉద్యోగుల సమస్యలకు చొరవ చూపాలని, ఉద్యోగులకు అధికారులకు మధ్య సమన్వ యాన్ని సాధించడానికి ప్రత్యేక చొరవ చూపాలని, పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న వారికి వెంటనే పదోన్నతులు కు అవకాశం కల్పించాలని, అధికారుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్ అధికారుల సంఘం ఉంటుందని వినుకొండ రాజారావు తెలియజేశారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

వర్గీకరణ అమలుచేసి ఉంటే, ఉమ్మడి రాష్ట్రంలో 23 జిల్లాల్లో 15 జిల్లాల్లో మాదిగలకు 9.11 శాతం వాటా దక్కేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జనాభా దామాషా ప్రకారం వర్గీకరణకు కట్టుబడిన ప్రభుత్వం నేడు విభజన ఆంధ్రప్రదేశ్లో జిల్లా యూనిట్ అనడం వెనుక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఉదాహరణకు నేడు తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం యస్సీ వర్గీకరణ అమలుకోసం వేసిన షమీమ్ అక్తర్ కమీషన్ నివేదికను పరిశీలిస్తే జనాభా దామాషా ప్రకారం బేడబుడగ జంగాలతోపాటు అత్యంత వెనుకబడిన 14 కులాలను కలిపి వారి జనాభా 1,71,625 మందిగా వారికి 1శాతం రిజర్వేషన్ కేటాయించడం జరిగింది. అలాగే మాదిగలు 32,33,642 కాగా వారితోపాటు మాదిగ ఉప కులాలు 17ను కలిపి వారి జనాభా 32,74,377గా తెలిపి, వారికి 9శాతం రిజర్వేషన్ కేటాయించడం జరిగినదన్నారు. అలాగే మాల, మాల అయ్యవార్లు 15,27,143 మందికాగా, వీరితో ఆది ఆంధ్ర, ఆది ద్రావిడ, మాల సాలె, నేతకాని లతో పాటు 22 కులాలను కలిపి వారి జనాభా 17,71,682 తెలివి వారికి 5శాతం రిజర్వేషన్లు కేటాయించడం జరిగింది. ప్రస్తుత షమీమ్ అర్ నివేదికను గమనిస్తే తెలంగాణా రాష్ట్రంలో మాదిగ, మాదిగ ఉప కులాలకు 10శాతం రిజర్వేషన్లు దక్కినట్లు మనం గమనించవచ్చన్నారు. ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో చంద్రబాబు చేసిన వర్గీకరణలో మాకు దక్కింది 7శాతమే కానీ, మేము సామాజిక న్యాయానికి కట్టుబడి అన్ని కులాలకు మేలు జరగాలనే సంకల్పంతో ముందుకు సాగామన్నారు. నేడు విభజన ఆంధ్రప్రదేశ్లో యస్సీ జనాభా 84,45,400 అందులో మాలలు 40,43,101 మంది, మాదిగలు 34,68,967 మంది, ఉప కులాలు 9,33,332 మంది. వీరి జనాభా దామాషా ప్రకారం మాలలకు7 శాతం, మాదిగలకు 6శాతం, ఉప కులాలకు 2శాతం వస్తుందన్నారు. కానీ నేడు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్త జనాభా దామాషా ప్రకారం వర్గీకరణకు తిలోదకాలు ఇచ్చి, నేడు జిల్లా యూనిట్గా ముందుకు వస్తే, వర్గీకరణ చేసినట్లు చేసి, నాడు నేడు మాదిగలను మభ్యపెట్టినట్లు అవుతుందని తెలియజేస్తున్నామన్నారు. జిల్లా యూనిట్ ద్వారా వర్గీకరణ చేయాలని చూస్తే, రాజ్యాంగంలోని 371-డి ఆర్టికల్ను ఉల్లంఘించిన వారు అవుతారని, తద్వారా అనేక రకాల సాంకేతిక సమస్యలు వస్తాయని గుర్తించాలని విజ్ఞప్తి చేస్తూ, ఏ.పి.లోమాదిగల కంటే, మాలలు ఎక్కువ ఉంటే, వారి వాటా వారికి జనాభా దామాషా ప్రకారం దక్కాలని, మాదిగలు ఎంత ఉంటే అంత వారి వాటా దక్కాల్సిందేనని తెలియజేస్తూ, సామాజిక న్యాయానికి కట్టుబడిన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ యస్సీల జనాభాకు అనుగుణంగా వారి వారి దామాషా ప్రకారం రాష్ట్ర యూనిట్ వర్గీకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పిఎస్ రాష్ట్ర కో కన్వీనర్ ఆలూరి చిరంజీవి మాదిగ, రేణమాల మాధవ, కృష్ణ మాదిగ, ముట్లూరి మోజెష్ తదితరులు పాల్గొన్నారు.

కొమరోలు ఎస్సైగా నాగరాజు

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు నూతన ఎస్సైగా నాగరాజు సోమవారం కొమరోలు పోలీస్ స్టేషన్లో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ కొమరోలు మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు అన్ని విధాల కృషి చేస్తానని ప్రజలు తనకు సహకరించాలని ఆయన కోరారు.

బాధితులకు వేగంగా న్యాయం అందించాలి

ఏఎస్పీ నాగేశ్వరరావు

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రజల నుండి వచ్చే వివిధ రకాల ఫిర్యాదులను పరిష్కారించుటయే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ఐ.పి.యస్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు మరియు పోలీస్ అధికారులు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం" (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా పలు ప్రాంతాల నుండి వచ్చిన పిర్యాదుదారులతో అధికారులు ముఖాముఖీగా మాట్లాడి వారి ఫిర్యాదుల గురించి వివరంగా అడిగి తెలుసుకుని ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, సత్వరం పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ఇలా ఉన్నాయి. తనకు, మరికొంత మంది రైతులకు సబ్సిడీ పనిముట్లు ఇప్పిస్తామని దర్శికి చెందిన ఒక వ్యక్తి రూ.16,82,000 డబ్బులు తీసుకోని రెండు సంవత్సరాలు గడుస్తున్న వస్తువులు కానీ మరియు డబ్బులు ఇవ్వటం లేదని దర్శికి చెందిన రైతులు ఫిర్యాదు. తన కుమారుడుకి కరెంటు ఆఫీస్‌లో ఉద్యోగం ఇప్పించమని తన వద్ద నుండి ఆరు లక్షల రూపాయలు డబ్బులు ఒంగోలు చెందిన ముగ్గురు వ్యక్తులు తీసుకోని ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బులు అడుగుతుంటే బెదిరిస్తున్నారని ఒంగోలు చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు. ఈ కార్యక్రమంలో సింగరాయకొండ సీఐ హాజరత్తయ్య, సీఐ జగదీష్, ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండు రంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు రజియా సుల్తాన్, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

కరూర్ వైశ్య బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం

విశాలాంధ్ర - ఒంగోలు : కరూర్ వైశ్య బ్యాంక్ (కేవీబీ) సోమవారం ఒంగోలులో తమ నూతన శాఖను ప్రారంభించింది. 35 వార్డు మంగమూరు డొంక వద్ద గ్రౌండ్ ఫ్లోర్‌లో ఈ శాఖను ఏర్పాటు చేశారు. సోమవారం జరిగిన ప్రారంభోత్సవ సభలో పాల్గొన్న ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వరరావు ఈ కొత్త శాఖను ప్రారంభించారు. ఈ శాఖ పొదుపు, కరెంట్ ఖాతాలు సహా డిపాజిట్లు, రుణాలు వంటి సమగ్రమైన బ్యాంకింగ్ సేవలను అందిస్తుందని ఈ సందర్భంగా కేవీబీ ప్రాంతీయ ప్రతినిధి చెప్పారు. కొత్త శాఖ అన్ని ప్రాథమిక బ్యాంకింగ్ లావాదేవీలను కస్టమర్ల నిర్దిష్ట అవసరాలను కూడా తీరుస్తుందన్నారు. రిటైల్, సంస్థాగత, వినియోగదారుల రుణాలను కవర్ చేసే బ్యాంకింగ్ ఉత్పత్తులు, ఆర్థిక సేవల యొక్క మొత్తం సేవలను అందిస్తుందన్నారు. ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ సౌకర్యాలను కేవీబీ అందిస్తుందని, బ్యాంక్ యొక్క మొబైల్ బ్యాంకింగ్ యాప్ కేవీబీ డిలైట్ 150కి పైగా ఫీచర్ల ద్వారా ఆర్థిక, ఆర్థికేతర సేవల సౌలభ్యాన్ని అందిస్తుందని తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చంద్రన్న అడుగులు

(మొదటిపేజీ తరువాయి)

ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇప్పించడంతో పాటు వారికి ఉచితంగా మిషన్లు పంపిణీ చేస్తామన్నారు. కుట్టులో ఆధునిక శిక్షణ తరగతులు నిర్వహించిన మహిళల స్వయం ఉపాధికి ప్రభుత్వం పరంగా తోడ్పాటును ప్రభుత్వం అందించనుందన్నారు. ఉమెన్ ఫర్ ఉమెన్ బై ఉమెన్ కార్యక్రమంలో భాగంగా లక్షకు పైగా డ్వాక్రా ఉత్పత్తులను రికార్డు స్థాయిలో విక్రయించారన్నారు. ఎన్‌డిసి ప్లాట్ఫారం వావ్ జెనీ యాప్‌లను ఉపయోగించి 5.13 కోట్లు ఆర్జించిందన్నారు. 7,471 పట్టణ పేద మహిళలకు 645.52 కోట్లు బ్యాంకు రుణాలు పంపిణీ చేశారని ఒక్కో మహిళకు సుమారు,రూ. 50 వేల నుంచి రూ.2 లక్షలు అందజేశారు. లబ్ధిదారులకు రూ. లక్ష మంజూరు కోసం చెక్కులు అందజేశారన్నారు. ఉత్పాదిక రుణ పథకం కింద 1,826.43 కోట్లు,43 వేలమంది గ్రామీణ మహిళలకు బ్యాంకుల లింకేజీ ద్వారా స్త్రీ నిధి కింద 1,000 కోట్లు అందించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 18,515 మంది సర్వీస్ ప్రొవైడర్లకు లబ్ధి చేకూరనుందని వీరికి నికర ఆదాయం రూ. 15,000 నుండి రూ.నెలకు 35,000. ఎలక్ట్రీషియన్లు ప్లంబర్లు కార్పొరేటర్లు, బ్యూటీషియన్లు గృహపకరణాల మరమ్మత్తులు మొదలైన వాటిలో సర్వీస్ ప్రొవైడర్లకు శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. రేపిడితో ఒప్పందం 3 ఆన్ బోర్డింగ్ ఛార్జీలు, నెలవారీ చార్జీలను మాఫీ చేస్తుందన్నారు. రాబిట్ పై మహిళలు రూ. 30 వేలు ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా మహిళా రైడర్లకు ప్రభుత్వం 1,000 ఎలక్ట్రిక్ వాహనాలను అందించిందన్నారు. ప్రకృతి అరకు కాఫీ తో ఒప్పందం కుదిరింది, ప్రపంచ మార్కెట్లో అరకు కాఫీ ఉత్పత్తులను పెంచేందుకు గ్రామీణ ప్రాంతాలకు అరకు కాఫీని విస్తరింప చేసేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తామన్నారు, తొలి దశలో100 అరకు కాఫీ అవుట్ లెట్లను ఏర్పాటు చేయనున్నారని మహిళలకు ఉపాధి లభిస్తుందన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని 55,607 మంది అంగన్వాడీ కార్యకర్తలు, 48,909 మంది హెల్పర్లకు ప్రయోజనం చేకూర్చేందుకు గ్రాడ్యుటీని అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. దీని ద్వారా ఒక్కో అంగన్వాడీ కార్యకర్తకు రూ.1.79 లక్షల నుండిరూ. 2.32 లక్షలు ఆదాయం రానుందన్నారు. అలాగే హెల్పర్లకు రూ. 1.09 లక్షల నుండి రూ.1.41 లక్షలు రానున్నాయన్నారు. పదవీ విరమణ పొందిన మరణించిన ఆశ వర్కర్లకు జూన్ 2024 నుండి గ్రాడ్యుటీ అమలు చేయబడుతుందన్నారు. ప్రభుత్వం గత ఏడాది జూన్ నుంచి అమలు చేయనున్న గ్రాడ్యుటీకి రూ.1.90 కోట్లు కేటాయించిందన్నారు. పీఎం విశ్వకర్మ పథకం ద్వారా మహిళలను ఆర్థికంగా వృద్ధిలోకి తెచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సుమారు పీఎం విశ్వకర్మ పథకం ద్వారా రాష్ట్రంలో 1000 మంది మహిళలు రూ. లక్ష వరకు రుణాలు మంజూరు చేయనుందని తెలిపారు.మహిళలను ఆర్థికంగా ఎదిగేందుకు సీఎం చంద్రబాబు ఎన్నో పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు.

విద్యావ్యవస్థ అస్తవ్యస్తం

(మొదటిపేజీ తరువాయి)

కాలేజీలు తమకు వద్దని కేంద్రానికి లేఖ రాసిన ఘనుడు చంద్రబాబు నాయుడు అని ఎద్దేవా చేశారు. మెడికల్ సీట్లను అమ్ముకోవచ్చని దురుద్దేశంతోనే చంద్రబాబు ఈ పని చేశారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయటంలో విఫలమయ్యారన్నారు. జిల్లాలోని పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు ఒక్క సెంటీమీటర్ నిర్మాణం కూడా చంద్రబాబు చేపట్టలేదు అన్నారు. ఇప్పటివరకు పూర్తయిన 90శాతం నిర్మాణం కేవలం వైయస్ రాజశేఖర్ రెడ్డి, వైయస్ జగన్ లు పూర్తి చేసినవే అన్నారు. తిరిగి వైసిపి అధికారంలోకి వస్తుందని, వలిగొండ ప్రాజెక్టును వైసిపి ప్రభుత్వం మాత్రమే పూర్తి చేస్తుందని జోష్యం చెప్పారు. అసెంబ్లీలో ప్రజల సమస్యల పట్ల తమ గళం విప్పేందుకు తగిన సమయం కేటాయించనందునే తాము ప్రతిపక్ష హెూదా అడుగుతున్నామన్నారు. ఢిల్లీ అసెంబ్లీలో తగిన బలం లేకున్నా ప్రతిపక్ష హెూదా ఇచ్చారని గుర్తు చేశారు. చంద్రబాబు నాయుడుకు ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత మాటలు మార్చటం వెన్నతో పెట్టిన విద్య అన్నారు. చంద్రబాబు నాయుడు మరోసారి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈనెల 12న నిర్వహించే యువత పోరు కార్యక్రమంలో జిల్లాలోని విద్యార్థులు, నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమానికి ముందుగా కార్యక్రమ పోస్టర్ను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసిపి ఒంగోలు నియోజకవర్గ ఇన్చార్జ్ చుండూరి రవిబాబు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదేన్న, బత్తుల బ్రహ్మానందరెడ్డి, కుప్పం ప్రసాద్, కె.వి రమణారెడ్డి, పి డి సి సి బ్యాంక్ మాజీ చైర్మన్ బన్నీ, జిల్లా యువజన అధ్యక్షులు గోగంటి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేని ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర-సంతనూతలపాడు : పేద వర్గాల విద్యాసేవకు కట్టుబడిన మహోన్నత మాతృమూర్తి సావిత్రిబాయి పూలేని ఆదర్శంగా తీసుకుందామని సంతనూతలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డి డి.ఓ డాక్టర్ పి.హరిణి పేర్కొన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ. భారతి గారి ఆదేశాల మేరకు మండలంలోని అనేక గ్రామాల్లో దివ్యాంగులపై సర్వే చేసిన ఇంటిగ్రేటెడ్ లీగల్ టీం ముగింపు కార్యక్రమం సోమవారం పిహెచ్సిలో నిర్వహించారు. నిర్వహించిన సభకు సభా సంచాలకుడిగా సిహెచ్ఓ ఆర్. ప్రసాద్ వ్యవహరించగా, ప్యానెల్ న్యాయవాది, జానుడి సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ నూకతోటి రవికుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ హరిణి మాట్లాడుతూ ఎన్నో అననుకూల పరిస్థితులను ఎదిరించి పేద వర్గాల విద్యార్థులకు విద్యా బోధన చేసిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అన్నారు. పారా లీగల్ వాలంటీర్ పి. సతీష్ మాట్లాడుతూ జిల్లా కోర్టు వారి ఆదేశాల మేరకు సంతనూతలపాడు మండలంలోని అన్ని గ్రామాలలో నిర్వహించిన ఇంటింటి సర్వే కార్యక్రమానికి వైద్య శాఖకు చెందిన ఏఎన్ఎంలు ఎంతో తోడ్పాటుగా నిలిచారు అని అన్నారు.

విశ్రాంత బ్యాంకు మేనేజర్ ఎద్దు విజయ్ కుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు పాటుపడుతున్న ప్రతి వైద్యులు, నర్సులు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ఎంతో అభినందనీయులని అన్నారు. సహకరించిన ఏఎన్ఎం, ఆశా వర్కర్లను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పి హెచ్ సి వైద్యులు డాక్టర్ జె.నాగరాజు, డాక్టర్ ప్రశాంతరెడ్డి, పిహెచ్ ఏన్ ఏమ్. వీరమ్మ, ఎన్. సలోమి, ఏ ఎన్ ఎమ్ డి.భాగ్యలక్ష్మి, కె. కృష్ణవేణి, హెల్త్ సూపర్వైజర్ బి. కృష్ణ, ఆశా వర్కర్లు టి. సుజాత, శ్రీలక్ష్మి, ఏ. భ్రమరాంబ, డి.మాధవి, ఆర్.లక్ష్మీ, బి.సులోచన, ఆర్.మణి రత్నకుమార్, స్టాఫ్ నర్సు టి.ఝాన్సీ తదితరులు పాల్గొనగా మహిళా దినోత్సవ సందర్భంగా పలువురిని వారి సేవలు గుర్తించి సత్కరించారు.

బూచేపల్లి కుటుంబాన్ని మర్యాదపూర్వకంగా కలిసిన కృష్ణారెడ్డి

విశాలాంధ్ర-దొనకొండ: వైసీపీ జిల్లా కార్యాలయంలో దర్శి ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు డా.బూచేపల్లి శివప్రసాదరెడ్డిని, జిల్లా పరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మలను నూతన మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి తన అనుచరులతో వెళ్ళి మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. ముందుగా వారిని పూలమాలలు, శాలువలతో సన్మానించి బొకేలు అందజేశారు. 3వ సారి తమపై నమ్మకంతో కన్వీనర్ బాధ్యతలు అప్పగించినందుకు క్రిష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలియజేసి, మండలంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలతో కలిసి పని చేస్తామని తెలిపారు. ఆయన వెంట బత్తుల వెంకటసుబ్బయ్య యాదవ్, కాలూరి రమణయ్య, బీమిని వెంకటేశ్వర్లు, పాతకోట కోటిరెడ్డి, గొంగటి పోలిరెడ్డి, గుంటు పోలయ్య, తమ్మనేని శ్రీనివాసరెడ్డి, విప్పర్ల చిన్నమల్లయ్య, విప్పర్ల సుబ్బయ్య, తాల్లూరి నగేష్ తదితరులున్నారు.

భవిత కేంద్రం తనిఖీ

విశాలాంధ్ర-దొనకొండ: స్థానిక భవిత కేంద్రాన్ని ప్రకాశం జిల్లా సహిత విద్యా సమన్వయకర్త నాగేంద్ర నాయక్, ఏపీఓ జాలిరత్నం సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలను పరిశీలించి తగు సూచనలిచ్చారు. రికార్డులు చూసి సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. సిబ్బంది పని తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు సిహెచ్ వెంకటేశ్వర్లు, యం.ఉషారాణి, సిఆర్పి చెంచిరెడ్డి పాల్గొన్నారు.

పబ్లిక్ గ్రీవెన్స్‌లో 77 ఫిర్యాదులు

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రజల నుండి వచ్చే వివిధ రకాల ఫిర్యాదులను పరిష్కారించుటయే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, పోలీస్ అధికారులు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం" (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులతో అధికారులు ముఖాముఖీగా మాట్లాడి వారి ఫిర్యాదుల గురించి వివరంగా అడిగి తెలుసుకుని ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, సత్వరం పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. అందిన ఆయా ఫిర్యాదుల గురించి సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి వెంటనే చట్ట ప్రకారం విచారణ జరిపి భాదితులకు త్వరితగతిన న్యాయం అందించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్కువగా భూ వివాదాలు, జాబ్ ఫ్రాడ్, కుంటుంబ సమస్యలు, చీటింగ్ మరియు ఇతర సమస్యల గురించి ప్రజా పిర్యాదులు వచ్చాయి.

తొమ్మిది మంది మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల కేంద్రమైన నిర్వహించినట్లు కొనకనమిట్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం 9 మంది మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించినట్లు వైద్యాధికారి ఎస్పీ బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కొనకనమిట్ల మండలంతో పాటు పొదిలి, మరిపూడి దొనకొండ మండలాల నుంచి వచ్చిన మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను చేశామన్నారు. ప్రభుత్వము వారికి అందజేస్తున్న పారితోషికం త్వరలో వారి బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు.

'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'కు నాలుగు అర్జీలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో నాలుగు అర్జీలు అందాయని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ తెలిపారు. అందులో ఒకటి భూమిని సర్వే చేయాలని, రెండు భూమిని ఆన్లైన్ చేయాలని, మరొకటి డీకే పట్టా మంజూరు చేయాలని అర్జీలు వచ్చాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్ శ్రీకాంత్, ఆర్ ఐ పీ వి ఎస్ ఆర్ మూర్తి, సీనియర్ అసిస్టెంట్ పి.శేషగిరిరావు, జూనియర్ అసిస్టెంట్ వి.కృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచి కాశీనాయక్ మృతి

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : పెద్ద దోర్నాల మండలం గంటవాని పల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచి గోనావత్ కాశీ నాయక్(62) గుండెపోటుతో సోమవారం ఉదయం మృతి చెందారు. 2014, 2019 సంవత్సరములో గంటవాని పల్లె గ్రామ సర్పంచ్ గా పనిచేశారు. గంట వానపల్లె కొత్తూరు గ్రామాలకు వెనలేని సేవలు చేశారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండి పంచాయతీ అభివృద్ధికి కార్యక్రమాలు చేశారు. మాజీ సర్పంచి గోనావత్ కాశీ నాయక్ మృతదేహానికి పెద్ద దోర్నాల మండలం టిడిపి వైసిపి నాయకులు, పరామర్శించారు. మాజీ ఎంపీపీ, వాసవి కన్యకా పరమేశ్వరి డిగ్రీ కాలేజ్ మాజీ ప్రిన్సిపాల్ గొనావత్ చిన్న ధర్మానాయక్, గంటవాని పల్లె సర్పంచి ఎక్కంటి రమాదేవి , వెంకటేశ్వర రెడ్డి, మండల టిడిపి నాయకులు, వైసీపీ నాయకులు పరామర్శించారు. దోగాల టిడిపి మండల కన్వీనర్ మల్లికార్జున రెడ్డి, బట్టు సుధాకర్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, మాజీ ఎస్టీ సెల్ నాయకులు గొనావత్ లాలు నాయక్, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గోనావత్ గాలయ్య నాయక్, చెంచయ్యలు, పూలమాలవేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను గొనావత్ చిన్న ధర్మానాయక్ పరామర్శించారు. మృతుని భార్య కుమారుడు కుమార్తె బంధువులు బోరున విలపిస్తున్నారు. సోమవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు బంధువులు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయం

కృష్ణారావు

విశాలాంధ్ర-ఒంగోలు : సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి ఒంగోలు రామనగర్లో ఘనంగా జరిగింది. ముందుగా సావిత్రిబాయి పూలే విగ్రహానికి ద్రావిడ దేశం అధ్యక్షుడు కృష్ణారావు పూలమాలతో అలంకరించి నివాళు లర్పించారు. కృష్ణారావు ప్రసంగిస్తూ మహిళలు వివక్షను ఎదుర్కొంటున్న ఆ కాలంలో మొట్టమొదటిసారిగా బడుగు బలహీన వర్గాల వారికి విద్యాభ్యాసం నేర్పిన వీర వనిత సావిత్రిబాయి పూలే గారు అని కొనియాడారు. మహారాష్ట్రలోని పూణేలో తన భర్త మహాత్మ జ్యోతిరావు పూలే గారి అడుగుజాడల్లో నడుస్తూ సామాజిక న్యాయానికి మహిళల ఆశయాల అభివృద్ధికి అనేక సేవలు చేశారని ముఖ్యంగా 1897లో సంభవించిన ప్లేగు వ్యాధిగ్రస్తులకు స్వయంగా తన సేవలను అందిస్తూ ఆ వ్యాధి సోకి ఆమె అమరులయ్యారన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బంకా చిరంజీవి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, యాదవ జేఏసీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు సిరుమామిళ్ల గోపికృష్ణ యాదవ్, యాదవ ప్రొటెక్షన్ ఫోర్స్ అధ్యక్షుడు మల్లెబోయిన రాజు యాదవ్, సాదం నరసింహారావు, కాలేషా ఉన్నారు.

రాళ్ల దాడిని ఖండించిన భైరవానంద స్వామి

విశాలాంధ్ర-దొనకొండ: ఇటీవల అన్నమయ్య జిల్లా రాయచోటీలో జరిగిన వీరభద్రస్వామి పారువేట ఉత్సవంలో ముస్లింలు చేసిన రాళ్ళ దాడిని స్థానిక ఆనంద ఆశ్రమ ధర్మకర్త భైరవానంద స్వామి ఖండించారు. హిందూ దేవతలను దూషించటం, పండగల వేళ ఆటంకాలు కలిగించటం అమానుషం అన్నారు. దాడి చేసిన వారిని వదిలి అమాయకులైన హిందూ సోదరులను అరెస్టు చేయటం తగదని, ఇప్పటికైనా దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలంటూ విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు.

IN THE COURT OF THE A.P. CO-OPERATIVE TRIBUNAL AT VIJAYAWADA.
O.P.NO. 41/2024.

BETWEEN

The Kakateeya Mutually Aided Thrift and Credit Co-operative Society Ltd, Rep. by it's General Manager, Kothapeta, Tenali - Petitioner

And

Mogali Pothuraju (R3) - Respondents

To

Mogali Pothuraju,
S/o. Mogali Nagabhushanam
D.No. 11-3, Near Main Street,
Peralachirala, Prakasam (Dt). A.P.

పై నెంబరు O.P. లో Respondent No. 3 అయిన మీకు శ్రీ కోర్టు ఆదు ఎన్ని పర్యాయములు కోర్టు సమన్లు (Notice) పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా మీ హాజరు నిమిత్తం ది. 19-03-2025వ తేదీన వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం గం॥10-30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్నచో తెలపుకొనవలెను. లేనిచో ఈ దావా మీకు పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది: 19-03-2025

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

CH. SRIDEVI, Advocate
52-4-6, Aruna Towers, Flat No. 306,
Near Old Panchayat Office, Gunadala,
Vijayawada. Cell No: 9391451446

'యువత పోరు' విజయవంతం చేయండి

దద్దాల నారాయణ యాదవ్

విశాలాంధ్ర - కనిగిరి: స్థానిక వైయస్ఆర్ సీపీ కార్యాలయం నందు సోమవారం ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో యువత పోరు కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించడం జరిగింది. దద్దాల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టోలో చెప్పిన విధంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన, విద్యాదీవెన కింద ఇవ్వాల్సిన బకాయిలు, అలాగే నిరుద్యోగ యువతకు 3 వేలు నిరుద్యోగ భృతి చెల్లించాలని. కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఉపసంహరించుకోవాలని నిరసన గళం తెలుపడానికి, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ ప్రభుత్వ సర్కార్పై నిరసన గళం తెలుపడానికి ఈ నెల 12వ తేదీన తలపెట్టిన "యువత పోరు" అనే కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగులతో కలిసి ఒంగోలుకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కు వినతి పత్రం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, వైయస్ఆర్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, కనిగిరి మండలం అధ్యక్షులు జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆది నారాయణరెడ్డి, మండల అధ్యక్షులు గోపవరపు బొర్రారెడ్డి, యక్కంటి శ్రీనివాసరెడ్డి, జడ్పీటీసీ ఓకే రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు భవనగిరి వెంకటయ్య, పామూరు మండలం సీనియర్ నాయకులు కల్లూరి రామిరెడ్డి, మహిళా నాయకులు కౌన్సిలర్ తమ్మినేని సుజాత, శ్రీరామ్ రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం సెక్రటరీ సూరసాని మోహన్ రెడ్డి, గట్లా విజయభాస్కర్ రెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ రాచపూడి మాణిక్యాలరావు, జిల్లా వాలంటీర్ విభాగం అధ్యక్షులు డాక్టర్ రసూల్, జిల్లా బీయుసి అధ్యక్షులు మితికాల గురవయ్య, దాదిరెడ్డి మాలకొండరెడ్డి పాల్గొనడం జరిగింది.

చలో విజయవాడ నిర్బంధంపై నిరసన

విశాలాంధ్ర-పామూరు: అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు కోసం చలో విజయవాడ కార్యక్రమనకు అడుగడుగున ఆటంకాలను ప్రభుత్వం కల్పించిందని సిఐటియు జిల్లా కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి అన్నారు. సోమవారం చలో విజయవాడ కార్యక్రమానికి మద్దతుగా స్థానిక మమ్మీ డాడీ సెంటర్లో అంగన్వాడీలు నిరసన తెలియజేశారు. మాల్యాద్రి మాట్లాడుతూ పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు పెంచమని అడిగితే గత ప్రభుత్వాలు అవలంబించిన విధానాలు నే ఈ ప్రభుత్వం అనుసరిస్తుందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను కొనసాగిస్తే భవిష్యత్తులో ఐక్య పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు.

సావిత్రిబాయి పూలేకి ఘన నివాళులు

విశాలాంధ్ర- హనుమంతునిపాడు : మండల పరిధిలోని మహమ్మదాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఆడపిల్లల చదువు కోసం నిరంతరం పాటుపడిన మహిళ చైతన్య మూర్తి సమాజంలో రుగ్మతలు రూపుమాపడానికి విశేష కృషిచేసిన సామాజిక ఉద్యమకారిణి భారత దేశ మొదటి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా పాఠశాల సిబ్బంది ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు కట్టా నాగమణి,విజయ భాస్కర్ రెడ్డి, శశి భూషణ్, హిమబిందు, రావులపల్లి శ్రీను,శ్రీదేవి,విజయలక్ష్మి, నారాయణ రెడ్డి, మోషే, దద్దాల శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సుజాత, కిషోర్, సందాని, కృష్ణారెడ్డి పాల్గొనడం జరిగింది.

సీలింగ్ భూమికి రెక్కలు!

- దస్త్రాలు మాయమైనా కదలని యంత్రాంగం
- యథేచ్ఛగా క్రయవిక్రయాలు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : ల్యాండ్ సీలింగ్ కింద పేదలకు పంపిణీ చేసిన భూముల క్రయవిక్రయాలు జరుగుతున్నా.. రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సదరు భూమి తాలూకా దస్త్రాలు మాయమైనట్లు కలెక్టర్కు తహసీల్దార్ నివేదిక పంపినా... స్థానికుల నుంచి ఫిర్యాదులు అందుతున్నా... యంత్రాంగం కనీస విచారణ చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మరోవైపు ఆయా స్థలాల మ్యుటేషన్లు, అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. యర్రగొండపాలెం మండలం వెంకటాద్రిపాలెం రెవెన్యూ ఇలాకాలో సాగుతున్న వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ప్రణాళిక ప్రకారమే... వెంకటాద్రిపాలెం రెవెన్యూలో అడవి మధ్యలో ఉన్న సర్వే 654/1లో దాదాపు 92.56 ఎకరాల పట్టా భూమిని ప్రభుత్వం సేకరించి... 1976లో పేదలకు పంపిణీ చేసింది. మరో 60 ఎకరాలు అటవీశాఖకు కేటాయించింది. ఈ మొత్తం భూమిని నిషేధిత జాబితాలో చేర్చాలిన అధికారులు... దశాబ్దాలుగా పట్టా భూమిగానే ఉంచారు. కొన్నాళ్ల క్రితం రికార్డులూ మాయమయ్యాయి. ఇదంతా పక్కా ప్రణాళిక ప్రకారమే జరిగినట్లు విమర్శలున్నాయి. పేదలకిచ్చిన 92 ఎకరాల్లో 86 ఎకరాలను ఓ ప్రైవేటు సంస్థ ఇటీవల కొనుగోలు చేసింది. వాటిని ప్లాట్లుగా విక్రయిస్తోంది. ప్రస్తుతం వీటికి ఏక మొత్తం(బల్క్)గా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. చిన్నచిన్న కారణాలతో సవాలక్ష అడ్డంకులు సృష్టించే అటవీ అధికారులు..అడవి మధ్యలో దారిచ్చి గేట్లు తెరవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కనీస విచారణ కరవు...

యర్రగొండపాలెం రెవెన్యూ కార్యాలయంలో ఏ రికార్డు ఎటుపోతుందో తెలియని పరిస్థితి ఉంది. ప్రభుత్వం పేదలకిచ్చిన అసైన్డ్, సీలింగ్, గృహ స్థలాల దస్త్రాలు కనిపించక పోవడమే ఇందుకు నిదర్శనం.

కనిగిరి అభివృద్ధే లక్ష్యం : ఉగ్ర

విశాలాంధ్ర - కనిగిరి: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా, ఈ ప్రాంత సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అసెంబ్లీలో పేర్కొన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో వరుసగా మూడోసారి అసెంబ్లీలో కనిగిరి నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించి, కనిగిరి అభివృద్ధి లక్ష్యమని స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల ఎనిమిదో రోజు కనిగిరి నియోజకవర్గంలోని ప్రభుత్వ హాస్టల్స్ మరియు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని ఆయన కోరారు. మహాత్మా జ్యోతిబా పూలే బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ను ఇటీవల మంత్రి సవిత సందర్శించారు. అక్కడి పరిస్థితులను గమనించిన మంత్రి, విద్యార్థులకు సరైన రక్షణ, వసతి సౌకర్యాలు లేవని తెలిపారు. ఈ స్కూల్ 2022 నుండి కనిగిరిలో అద్దె భవనంలో నడుస్తోంది. ప్రస్తుతం రెండువందల ముగ్గురు విద్యార్థులు ఉన్న ఈ స్కూల్కు నూతన భవనం నిర్మించి, అక్కడకు తరలించాలని మంత్రి సూచించారు. ఈ స్కూల్ కు శాశ్వత నూతన భవనం నిర్మాణానికి వీలైనంత త్వరగా నిధులు కేటాయించాలని ఆసెంబ్లీ వేదికగా మంత్రిని కోరారు. విద్యార్థులకు మెరుగైన అవకాశాలను అందించేందుకు స్కిల్ డెవలప్మెంట్ ద్వారా అగ్రికల్చర్, ఐటీ, ఇండస్ట్రియల్ సెక్టార్లలో శిక్షణ అవకాశాలు కల్పించాలని తద్వారా వారికీ ఉపాధి అవకాశాలను బిసి వెల్ఫేర్ ద్వారా అందించాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో కోరారు. బీసీ హాస్టల్స్ అభివృద్ధికి నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని ఆయన వెల్లడించారు. అదేవిధంగా, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ నిర్మాణం డెభై శాతం పూర్తయిందని, ఇంకా ముప్పై శాతం పనులు పెండింగ్లో ఉన్నాయన్నారు. ఈ నిర్మాణం ప్రారంభమై ఐదేళ్లు కావస్తున్నప్పటికీ, పూర్తి కాకపోవడం వల్ల భవనం శిథిలావస్థకు చేరుకునే ప్రమాదం ఉందని, మిగిలిన పనులు త్వరగా పూర్తయ్యేలా నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. కనిగిరిలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, సీఎం చంద్రబాబు, మంత్రి సత్యకుమార్ యాదవ్ సలహాతో దాతల సహకారంతో కెయంసి విధానం తీసుకొచ్చినట్లు అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాక, కనిగిరి ప్రభుత్వాసుపత్రిని దాతల సహకారంతో ఆధునీకరించామని, పదేళ్ల తరువాత సీ హెక్ సి హాస్పిటల్లో సిజేరియన్ ప్రసవం విజయ వంతంగా జరిగినట్లు తెలిపారు. ఈసిహెక్సి హాస్పిటల్ అభివృద్ధికి మరింత నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో కోరడం జరిగింది.

హక్కుల కోసం పోరాడిన మహిళలను ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర-సంతనూతలపాడు : మహిళా హక్కుల కోసం పోరాటాల చేసిన వారిని స్ఫూర్తిని కొనసాగిస్తే మహిళలకు రక్షణ ఉంటుందని ఐద్వా మండల కార్యదర్శి నెరుసుల మాలతి అన్నారు. స్థానికసుందరయ్య భవనం నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు కె.బుజ్జి అధ్యక్షతన జరిగాయి. ఐద్వా మండల కార్యదర్శి ఎన్ మాలతి మాట్లాడుతూ మహిళలు ఇంటిలోనూ పనిచేస్తున్న చోటా దోపిడీకి హింసకు గురవుతున్నారని అన్నారు. స్త్రీని విలాస వస్తువుగా చూసిన భూస్వామ్య వ్యవస్థ సరుకుగా మార్చిన పెట్టుబడిదారీ వ్యవస్థ వారికి స్వేచ్ఛనివ్వకుండా అణగ దొక్కారని ఆమె అన్నారు. ఈనాడు మనువాదాన్ని నెత్తికెక్కించుకొని స్త్రీలను కట్టుబాట్లు పేరుతో వారి అభివృద్ధిని వారి చైతన్యాన్ని దిగజార్చారని అన్నారు. అంబేద్కర్ చే రచించబడిన భారత రాజ్యాంగం మహిళలకు అనేక హక్కులు కల్పించారని వాటిని నేడున్న ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేయకపోగానీరు గారుస్తున్నా రని అన్నారు. ఐద్వా మహిళా సమస్యలకొరకు అనేక కార్యక్రమాలు తీసుకొని పనిచేస్తుందన్నారు. మహిళలు ఐక్యంగా ఉంటే మన సమస్యలను పరిష్కారం చేసుకోగలమని ఆమె అన్నారు. జెవివి నాయకులు కోడాటి కోటేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు చదువుకోవాలని చదువు మహిళల అభివృద్ధికి చైతన్యానికి తోడ్పడుతుందని తెలిపారు. మహిళలు చదువుకుంటే మూఢా చారాలకు దూరంగా ఉంటారని అన్ని రంగాల్లో అభివృద్ధి అవుతారని ఆయన అన్నారు. కార్యక్రమంలో పి శేషమ్మ కె లక్ష్మి పాల్గొన్నారు.

బండారు రామారావు విగ్రహ ప్రాంగణంలో

ఆక్రమణలు తొలగించాలి

విశాలాంధ్ర-ఒంగోలు : కీర్తిశేషులు బండారు రామారావు శ్రీరామ నాట్యమండలి వ్యవస్థాపక బృందం అధ్యక్షులు శ్రీపతి ప్రకాశం అధ్యక్షతన ఒంగోలు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ని కలిసి స్థానిక నెల్లూరు బస్టాండ్ సెంటర్లో గల బండారు రామారావు విగ్రహ ప్రాంగణం అన్యాక్రాంతమైందని వాటిని తొలగించాలని కమిషనర్కు వినతి పత్రం సమర్పించారు. 1982లో అప్పటి నుంచి మున్సిపల్ చైర్మన్ రెండు సెంట్లు భూమిని కేటాయించి విగ్రహం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని బండారు రామారావు విగ్రహ దాత స్వర్గీయ మాజీ శాసనసభ్యులు వేమా ఎల్లయ్య తర్వాత ఏర్పాటు చేశామని విగ్రహం చుట్టుపక్కల షాపులు వెలసి ఉన్నాయని వాటిని తొలగించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీరి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి త్వరలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ని కలిసిన వారిలో శ్రీరామ నాట్యమండలి ఉపాధ్యక్షులు వేమా శ్రీనివాసరావు, కండే శ్రీనివాసులు,ప్రధాన కార్యదర్శి యాదాల రాజశేఖర్,యు ప్రభుదాసు,మల్లికార్జున, పాలేటి కోటేశ్వరరావు,గడ్డం కృష్ణయ్య,బత్తుల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.త్వరలో కీర్తిశేషులు బండార్ రామారావు కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తామని శ్రీరామ నాట్యమండలి సభ్యులు తెలిపారు.

నాలుగు అర్జీలు

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాల యంలో రెవెన్యూ డివి జనల్ అధికారి రామలక్ష్మి అధ్యక్ష తన ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించా రు. భూ సమస్యలకు సంబంధించి నాలుగు అర్జీలు వచ్చాయని వాటిని పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు బదిలీ చేసినట్లు ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు.

ఘనంగా భువనేశ్వర స్వామి కళ్యాణం

విశాలాంధ్ర - చెరుకుపల్లి : గూడవల్లి మైత్రేయ ఆశ్రమం లో వేంచేసి ఉన్న శ్రీ భువనేశ్వరి సమే త భువనేశ్వర స్వామి కల్యా ణోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈనెల 8వ తేదీ నుండి స్వామివారి కళ్యాణ మహోత్సవ సంబరాలు సోమవారం నూతన పంచలోహ ఉత్సవ విగ్రహాలను గ్రామస్తుడు గుమ్మడి హరి, పద్మావతి దంపతులు అందించగా వారిచే కళ్యాణాన్ని బ్రహ్మశ్రీ చావలి శ్రీధర్ శర్మ, సిట్ల శివ సుబ్రహ్మణ్యం, మల్లెల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలో అన్నదానం నిర్వహించగా భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలు సేకరించారు కార్యక్ర మాలను ఆశ్రమ నిర్వాహకురాలు గంట నిర్మల మ్మ పర్యవేక్షించారు. అరుణ, ఓంకార్ బాబురావు, కృష్ణ గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వెలుగు ఏపిఎంకు సత్కారం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల మండలంలో ఉన్న 56 గ్రామ సంఘాలు, 1949 స్వయం సహాయక సంఘాల సభ్యులు అందచేసిన లక్ష రూపాయల విరాళాన్ని జిల్లాలోని సైనిక్ వెల్ఫేర్ వారికి సైనికులు, నావికులు, వైమా నిక దళంలోని సిబ్బందికి, వారిపై ఆధా రపడిన కుటుంబ సభ్యుల పునరావాసం, సంక్షేమం కోసం వెలుగు ఏపిఎం కడెం మధుసూదనరావు అందజేశారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఆయనను శాలువాతో సత్కరించి, ప్రశంసాపత్రం, అవార్డును అందజేశారు. అధికారు లు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల మండలం ఈపురుపాలెం పంచాయతీలోని ధాన్యం కల్లాలలో రైతులను వైయస్సార్ రైతు విభాగం అధ్యక్షుడు కావూరి రమణారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ధాన్యం సిద్ధంగా ఉన్నప్పటికీ అధికారులు కొనుగోలు చేయటం లేదని రైతులు తెలిపారు. ప్రభుత్వం ధర బస్తాకు రూ.1750 ఉంటే ప్రయివేట్ వ్యాపారస్తులు రూ. 1400 కొంటామంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలును వెంటనే ప్రారంభించాలని, పందిళ్ళపల్లి, వేటపాలెం, చీరాల నగర్, ఈపురుపాలెం పంచాయతీల లోని రైతులందరూ పంట నమోదు చేయించారని రైతులు నష్ట పోకుండా వెంటనే కొనుగోలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రభుత్వం మోసం

రేపల్లె వైసీపీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్

విశాలాంధ్ర - చెరుకుపల్లి : కోటి ఆశలతో కొత్త జీవితాలను ప్రారంభించాలనుకుంటున్న మధ్య తరగతి విద్యార్థుల ఉసురుపోసు కుంటున్న కూటమి ప్రభుత్వం తక్ష ణమే వారిని ఆదుకునే విధంగా చర్య లు చేపట్టాలని రేపల్లె నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. సోమవారం గుళ్ళ పల్లి క్యాంపు కార్యాలయంలో నియో జకవర్గ నాయకులు కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా ఉన్న ఇంజనీరింగ్,మెడికల్ లాంటి విభాగాలలో ఫీజు రీయంబర్స్‌మెంట్ ప్రవేశపెట్టి ఎందరో జీవితాలలో వెలుగులు నింపిన మహా మనిషి వైయస్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆయన ఆశయాలకు కొనసాగింపుగా వైసీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు ప్రాథమిక పాఠశాల దశ నుండి ఉన్నత విద్య వరకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి జీవితాలలో వెలుగులు నింపిన గొప్ప నాయకుడు జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఐదు త్రైమాసికాలుగా ఫీజు రీయంబర్స్‌మెంట్ ,వసతి దీవెన కింద ఇవ్వాల్సిన రూ. 4600 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయా లన్నారు.ఎన్నికల హామీలలో చెప్పిన విధంగా నిరుద్యోగ యువతకు నెలకు రూ. 3000ల భృతిని చెల్లించాల న్నారు. అలాగే కొత్త వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ప్రయత్నాలను ఉప సంహరించుకోవాలన్నారు. పేద విద్యా ర్థులకు వైద్య విద్యను అందు బాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కోర్కెల సాధనకై ఈనెల 12వ తేదీన జిల్లా కేంద్రంలో తలపెట్టిన నిరసన కార్యక్రమం యువత పోరులో పార్టీ నాయకులు,కార్యకర్తలు,విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం ఆయన పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి యువత పోరు పోస్టర్ ఆవిష్క రించారు. నియోజకవర్గ పార్టీ మహి ళా అధ్యక్షురాలు వీసం నాగలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు దుండి వెంకటరామిరెడ్డి,నిజాంపట్నం మండ ల పార్టీ అధ్యక్షుడు యార్లగడ్డ రాంబా బు, పార్టీ నాయకులు బొర్రా శ్రీనివా సరావు,యార్లగడ్డ మదనమోహన్, కాటూరి శివ,సాంబశివారెడ్డి,చిత్రాల ఓబేదుబిమటా బాలాజీ,కరేటి శేషగిరిరావు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే ఆరోగ్యానికి మేలు

విశాలాంధ్ర - బల్లికురవ : ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలతో ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతులుగా ఉంటారని ప్రకృతి వ్యవ సాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాణిశ్రీ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన బల్లికురవ, చెన్నుపల్లి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంతో పంటలు సాగు చేస్తున్న పావులూరి దానారావు,మువ్వ ఆంజనేయులు, ఈమని నాగరాజు రైతుల పొలాలను ఆమె పరిశీలించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు,గ్రామ సంఘ సమావే శాలలో ప్రకృతి వ్యవసాయాన్ని అజెండాగా పెట్టి సభ్యులందరికీ అవగాహన కల్పించి తద్వారా వేగవంతంగా రైతులు కెమికల్ వ్యవసాయం నుండి ప్రకృతి వ్యవసాయంలోకి మరెందుకు కృషి చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానం భూమి సారవంతంగా ఉండి అధిక దిగుబడు లు వస్తాయన్నారు.పురుగుమందు అవశేషాలు లేని ఆహార పదార్థాలను పండించడం ద్వారా అనేక రకాల వ్యాధులకు దూరంగా ఉండవచ్చున్నారు.అంతేకాకుండా పర్యా వరణాన్ని పరిరక్షించుకోవచ్చని,వ్యవసాయ పెట్టుబడులు తగ్గుతాయని రైతుల ఆదాయం మెరుగుపడుతుందని,రైతులందరూ ప్రకృతి వ్యవసాయ విధానాన్ని పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని కోరారు. జోన్‌కూప్ ప్రతినిధి ప్రతిమా,రైతు సాధికార సంస్థ రాష్ట్ర ప్రతినిధి సౌమ్య,అడిషనల్ డిపిఎం మోహన్, ఎన్‌ఎఫ్‌ఏ చందనదుర్గ,మాస్టర్ ట్రైనర్ అప్పారావు,యూనిట్ ఇన్‌ఛార్జిలు కల్పన, నా గాంజలి,నాగరాజు ఐసిఆర్పీలు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్ళను నిర్మించాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : అర్హులైన పేదలకు ఇంటి స్థలం కేటాయించి ప్రభుత్వమే ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షు డు షేక్ జిలానీ అన్నారు. చీరాల మండల తహశీల్దారు కార్యాలయం వద్ద అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ దళిత బహుజన పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించి తహశీల్దారు కె గోపి కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా షేక్ జిలానీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇళ్ళు లేని అర్హులైన పేదలకు స్థలం కేటాయించి ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని, ప్రజల ఆదాయంలో మార్పు లేకపోగా నిత్యావసర వస్తువుల ధరలు మాత్రం పెరిగిపోయాయని అన్నారు. అధిక ధరలను నియంత్రించి నిత్యావసరవస్తువులను ప్రభుత్వం అందజేయాలన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పెరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

సంఘాల అభివృద్ధికి చేయూత

విశాలాంధ్ర - పర్చూరు : మండలం వీరన్న పాలెం గ్రామంలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో సోమవారం మహిళా దినోత్సవం పురస్కరించుకొని బ్రాంచి పరిధిలోని గ్రామ సంఘ సహాయకులకు సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ నాగరాజశేఖర్ మాట్లాడుతూ బ్రాంచి పరిధిలో 302 సంఘాలకు గానూ 3029 సభ్యులు సంఘాల్లో ఉన్నారని తెలిపారు. 22 సంవత్స రాల నుండి బ్రాంచ్ పరిధిలోని మహిళలు తీసుకొన్న రుణాలు సక్రమంగా చెల్లించుతూ వారి అభివృద్ధికి బ్యాంకు ఎదుగుదలకు ఎంతగానో దోహద పడ్డారన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్రాంచి పరిధిలో ప్రభుత్వ ప్రాధా న్యత ఋణాలు ముఖ్యంగా లక్‌పతి దీదీ కింద 25 మంది లబ్ధిదారులుకు గేదెలు కొనుగోలు కోసం 25 లక్షలు ఇవ్వడం జరిగిందని తెలిపా రు. వెలుగు ఏపిఎం రామకృష్ణ మాట్లాడుతూ బ్యాంకు పరిధిలో ఎక్కువగా రుణాలు గ్రౌండింగ్ జరిగిందని మిగతా బ్యాంకుల కన్నా ఈ బ్యాంకులో ఎక్కువ రుణాలు, రికవరీ చాలా బాగా జరుగుతుందని తెలిపారు. బ్రాంచి పరిధిలోని 13 మంది వివోఏలను ఘనంగా సత్కరించి బహుమతులు అందజేశారు. సీసీలు శ్రీనివాసమూర్తి, నరసింహారావు, గ్రా మ సంఘాలు సహాయకులు, బ్యాంకు ఉద్యోగి కూరాకుల మానస పాల్గొన్నారు.

వరలక్ష్మి అవయవదానం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : అవయవదానం ద్వారా కొపనాతి వరలక్ష్మి అమరత్వం పొందారని ఆమె మరణించిన చిరకాలం మన మధ్యనే జీవిస్తూ ఉంటుందని ఆర్డిఓ పి.గ్లోరియా పేర్కొన్నారు. అవయవ దానం చేసిన వరలక్ష్మి భౌతిక కాయానికి సోమవారం ఉదయం వివేకానంద కాలనీలో బాపట్ల ఆర్డిఓ పి.గ్లోరియా,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ,తహసీల్దార్ షేక్ సలీమా మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఊపిరితిత్తులు, కాల ేయం,కిడ్నీలు దానం చేయడం ద్వారా మరో ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. ఆమె భర్త వీర కుమార్,వరలక్ష్మి మామయ్య నరసింహారావు నిర్ణయం తీసుకుని,ఆమెను చిరంజీవిని చేశారన్నారు. అవయవ దాత వరలక్ష్మి భర్త వీర కుమార్‌ను ఆర్డీఓ పి.గ్లోరియా శాలువా కప్పి అభినందించారు. జిల్లా శరీర,అవయవ దాతల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు,సభ్యులు యాజలి భాస్కరరావు,యుటిఎఫ్ నాయకులు జడ వినయ్‌కుమార్,ఎంఎస్ఎస్ భారతి, ఉదయకుమారి, కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

పీడీ పద్మకు సన్మానం

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ స్వయం సహాయక సంఘాల ద్వారా సైనిక సంక్షేమం కోసం డిఆర్డిఏ బాపట్ల జిల్లా పిడి పద్మ జిల్లా నుంచి రూ 10.30 లక్షలు సేకరించి చెక్కు రూపంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు సోమవారం జిల్లా సైనిక సంక్షేమ అధికారి గుణశీలతో కలిసి అందజేశారు చేశారు. ఈ సందర్భంగా జేసీ ప్రఖర్ జైన్ పిడి పద్మ దృశాలువాతో సన్మానించి మెమెంటో ప్రశంసాపత్రం అందజేశారు. పీడీతో పాటు పలువురు ఏపిఎం,ఏసీలను అభినందించారు.

'పది' భవిష్యత్తుకు బాట

ఏపీ మోడల్ స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ దగ్గుబాటి రాంబాబు

విశాలాంధ్ర - చీరాల : జీవితంలో ఉన్నత స్థితికి చేరడానికి పదవ తరగతి చదువుతో భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కృతి ఫౌండేషన్ చైర్మన్ ఆకురాతి వెంకట అశ్విని అన్నారు.సోమవారం ఏపీ మోడల్ స్కూల్ చీరాలలో కృతి ఫౌండేషన్ చైర్మన్ ఆకురాతి వెంకట అశ్విని ఆమె భర్త బట్టు ప్రదీప్‌ల సహాయ సహకారాలతో ఎస్ఎంసి చైర్మన్ దగ్గుబాటి రాంబాబు ఎస్ఎంసి సభ్యుల ఆధ్వర్యంలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు పరీక్ష అట్టలు,పెన్సిల్, పెన్,షార్ప్నర్,ఎరైజర్ వంటి పరీక్ష సామగ్రిని అందించారు.ఈ సందర్భంగా కృతి ఫౌండేషన్ చైర్మన్ వేంకట అశ్విని,బట్టు ప్రదీప్‌లు మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థితికి చేరడానికి విద్యార్థిని విద్యార్థులకు పదవ తరగతి ఎంతో కీలకమని రానున్న పరీక్షలలో విద్యార్థిని విద్యార్థులు పరీక్ష బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు.చదువుపై శ్రద్ధ పెట్టి నేటి పోటీ ప్రపంచంలో ముందుకు సాగాలని అప్పుడే జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోగలుగుతామన్నారు.ఏపీ మోడల్ స్కూల్ చీరాల ఎస్ఎంసి చైర్మన్ దగ్గుబాటి రాంబాబు మాట్లాడుతూ చదువును కష్టంగా కాకుండా ఇష్టంగా చదివినప్పుడు మనం అనుకున్న ఉన్నత శిఖరాలను చేరుకుంటామని,అర్థము కానివి అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ అర్థమైన వాటిని సునాయాసనంగా రాస్తూ పరీక్షలలో మంచి ఉత్తీర్ణత శాతాన్ని సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు, విద్యను నేర్పించిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని చిన్నారులకు సూచించారు.దాతలు అందించిన ఈ పరీక్ష సామగ్రిని సద్వినియోగం చేసుకొని పరీక్షలు బాగా రాసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కృతి ఫౌండేషన్ చైర్మన్ ఆకురాతి వెంకట అశ్వినికి ఎస్ఎంసి కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో చిరు సన్మానం చేశారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది పర్వీన్ సుల్తానా, మహేష్,ఎస్ఎంసి కమిటీ సభ్యులు హేమచంద్ర శ్రీనివాస్, ఆనంద్, సువార్త,శివ లీల,దివ్యభారతి,కళ్యాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

31వ తేదీలోగా కుట్టు మిషన్ శిక్షణకు దరఖాస్తులు

విశాలాంధ్ర - రేపల్లె : 2024-25 సంవత్సరానికి బీసీ వార్షిక ప్రణాళికలో భాగంగా బీసీ, కాపు,ఈడబ్ల్యూఎస్,కమ్మ,రెడ్డి,క్షత్రియ,ఆర్యవైశ్య, బ్రాహ్మణ కులంలో పేద మహిళలకు ప్రభుత్వం వారు టైలరింగ్‌లో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి 75శాతం హాజరుతో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కుట్టు మిషన్లు ఇవ్వనున్నట్లు రేపల్లె మున్సిపల్ కమిషనర్ కే.సాంబశివరావు తెలిపారు.ఈ సందర్భంగా తన కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ 18 నుండి 50 సంవత్సరాలు మధ్య వయసు వారు ఈనెల 10వ తేదీ నుండి 31వ తేదీలోగా సంబంధిత సచివాలయంలో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. టైలరింగ్ సెంటర్ పట్టణంలోనే ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు.

రోడ్డు ప్రక్కనే చిన్నారి

విశాలాంధ్ర - బాపట్ల : సంతమాగులూరు మండలం, ఫతేపురం రోడ్డు ప్రక్కన గుర్తు తెలియని పుట్టిన బిడ్డను వదిలి వేయడం జరిగిందని జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.పురుషోత్తమరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పాపకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు లేదా సంరక్షకులు ఎవరైన పాపనును గుర్తిస్తే 30 రోజుల లోపు వచ్చి ఆధారాలు చూపించి పాపను తీసుకుని వెళ్ళవచ్చు న్నారు.లేనిచో చైల్డ్ ఎల్ఫేర్ కమిటీ వారి ఆదేశాల ప్రకారం ఈ పాపను అనాధగా ప్రకటించి ప్రభుత్య నిబంధనల ప్రకారం దత్తత ఇవ్వబడునని తెలియజేశారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి

విశాలాంధ్ర - బాపట్ల : బహుజన సమాజ్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ గడ్డం ఏలియా ఆద్వరంలో ఉద్యమకారిణి చదువుల తల్లి, విద్యాభివృద్ధి, హక్కుల కోసం కృషి చేసిన తొలితరం మహిళా సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా బాపట్ల మహనీయులు విగ్రహాల కూడలిలో ఉన్న ఆమె చిత్రపటానికి ఘననివాళులు అర్పించారు. ఈ కార్యక్రంలో డాక్టర్ గుదే రాజారావు ఇన్‌ఛార్జి , కాగిత కోటేశ్వరరావు జిల్లా అధ్యక్షులు, పాలపర్తి సంతమ్మ, మిండాల జాన్సి, చింత ఆనంద్, ప్రశాంత్, తదితరలు పాల్గొన్నారు.

నల్లబర్లి పొగాకు కొనుగోలుకు చర్యలు తీసుకోవాలి

సీహెచ్ గంగయ్య

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలోని అద్దంకి, పర్చూరు నియోజకవర్గంలోని రైతుల పండించిన నల్లబర్లి పొగాకు కొనుగోలు చేయుటకు జిల్లా అధికారులు,ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు.సోమవారం సీపీఎం బృందం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా జాయింట్ కలెక్టర్ వినతి పత్రం ఇవ్వడం,వెంటనే జిల్లా వ్యవసాయ శాఖ జెడికి చెప్పి సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలని చెప్పడం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ జిల్లాలో అద్దంకి ,పర్చూరు నియోజకవర్గంలో సుమారు 30 వేల ఎకరాల్లో నల్లబర్లి పొగాకు వేయటం జరిగిందని,ఎకరానికి రూ.1,50,000 వరకు పెట్టుబడి అయిందని,ప్రవేట్ కంపెనీ వాళ్ళు మంచి ధర ఇస్తామని ప్రోత్సహించి నారన్నారు. ఈరోజు ఎక్కడ కూడా పొగాకు కొనుగోలు చేయని పరిస్థితిలో రైతులు ఆందోళనలో ఉన్నారన్నారు.మధ్య దళారులు క్వింటాకు నాలుగైదు వేల రూపాయలు కన్నా ఎక్కువ కొనే పరిస్థితి లేదన్నారు.జిల్లా అధికారులు ,జిల్లాలో ఉన్న మంత్రులు ముఖ్యంగా అద్దంకి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్ చొరవ చూపి కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి అద్దంకి,పర్చూరు నియోజకవర్గాల్లో నల్లబర్లి పొగాకు వేసిన రైతులను ఆదుకోవాలని కోరారు.లేనిపక్షంలో రైతులను కూడగట్టి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.కృష్ణమోహన్,జిల్లా కమిటీ సభ్యులు పి.కొండయ్య పాల్గొన్నారు.

స్వచ్ఛ బాపట్ల అందరి కర్తవ్యం

- కమీషనర్ రఘునాధరెడ్డి

విశాలాంధ్ర - బాపట్ల : స్వచ్ఛ్ బాపట్ల మనందరీ కర్తవ్యం అని బాపట్ల మున్సిపల్ కమీషనర్ రఘునాధరెడ్డి తెలిపారు. బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని వార్డులో సోమవారం ఉదయం కమిషనర్ పర్యటించారు. స్థానిక సి.బి.జెడ్.చర్చివద్ద పారిశుధ్య కార్మికుల హాజరు పట్టికను తనిఖీ చేసి కార్మికులతో మాట్లాడి వార్డులో ప్రతిరోజు నిర్వహిస్తున్న పారిశుధ్యంపై నేరుగా వారినే వివరాలు అడిగి తెలుసుకున్నారు.వార్డులో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.పారిశుధ్యం మెరుగుదలకు తీసుకోవలసిన చర్యలను గురించి ప్రజారోగ్య విభాగ అధికారులతో మాట్లాడారు.పట్టణంలో పారిశుధ్యం విషయంలో అలసత్వం వహించవద్దని సిబ్బందికి సూచించారు.తాగునీటి సరఫరా గురించి అసిస్టెంట్ ఇంజనీర్ వారితో మాట్లాడారు.వార్డులో స్వయంగా తిరిగి తాగునీటి సరఫరా గురించి ప్రజలనే అడిగి వివరాలు తెలుసుకున్నారు.లీకులను గుర్తించి సత్వరమే వాటిని బాగు చేయాలని సూచించారు.ప్రతిరోజు సాంకేతిక పరీక్షలు ల్యాబ్‌లో చేసిన తదుపరి పూర్తి సురక్షితమని నిర్ధారణ అయిన తర్వాత మాత్రమే పట్టణానికి తాగునీటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు.అనంతరం సూర్యలంక రోడ్డులోని గాయత్రి అపార్ట్మెంటు వద్ద చెత్త లోడింగ్ పాయింట్‌ను పరిశీలించారు. .రోడ్లపై, రోడ్ల మార్జిన్‌లపై చెత్త నిల్వలు లేకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇనుప కంచె మెష్‌లలో మాత్రమే చెత్త డబ్బాలను ఉంచాలని పారిశుద్ధ్య కార్మికులకు చెప్పారు.అనంతరం ఇమ్మడిశెట్టి వారిపాలెం సచివాలయం ముందు సందర్శించిన ఆయన పి4 సర్వేను గురించి సచివాలయ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్న క్యాంటీన్ పరిశీలించిన ఆయన,క్యాంటీన్ పరిసరాలను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని,స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందించాలని క్యాంటీన్ సిబ్బందికి సూచించారు. అనంతరం పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పార్కు సుందరీకరణ పనులను పరిశీలించారు.వారి వెంట అసిస్టెంట్ ఇంజనీర్ జి.ప్రసాద్,పురపాలక సంఘ సిబ్బంది,సచివాలయ సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

విశాలాంధ్ర - బాపట్ల : నగరం మండలం,నగరం గ్రామం ఎస్టీ కాలనీలో నివసిస్తున్న బాలికపై అత్యాచారానికి పాల్పడిన అగ్రవర్ణ కులానికి చెందిన మరక అప్పారావు కుమారుడు వినయ్‌ని కఠినంగా శిక్షించి ఆ అమ్మాయికి ఎక్స్‌గ్రేషియో న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎరుకల సేవా సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు తుమ్మ శ్రీనివాసరావు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం జేసీకి వినతిపత్రం అందజేశారు.ఇటీవల నగరం మండలం నగరం గ్రామం ఎస్టీ కాలనీలో నివసిస్తున్న ఎరుకల కుటుంబానికి చెందిన దేవరకొండ రమణ శ్రీనివాసుల కుమార్తె (11) బాలికపై అత్యాచారానికి పాల్పడిన మరక వినయ్‌ని కఠినంగా శిక్షించాలని బాధిత కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ ఎరుకల సేవా సంఘం తరఫున న్యాయం చేయాలని వేడుకుంటున్నామన్నారు.ఆ కుటుంబం కాయ కష్టం చేసుకుంటూ జీవనం గడుపుతున్న తరుణంలో ఇటువంటి సంఘటన కుటుంబానికి జరగటం ఎంతో బాధకరమైన విషయం అన్నారు. ప్రభుత్వం బాధితురాలు పట్ల దయ చూపించి ఎక్స్ గ్రేషియా,ఉండటానికి నివాసిత స్థలం,బతకటానికి ఆ కుటుంబానికి ఒక ప్రభుత్వ ఉద్యోగం,రెండు ఎకరాల వ్యవసాయం భూమి కల్పించే దిశగా ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. ఏపీ వైఎస్ఎస్ స్టేట్ సెక్రటరీ పాకల రాజేష్ కుమార్,ఏపీ వైఎస్ఎస్ డిస్టిక్ యూత్ ప్రెసిడెంట్ బచ్చు భరత్,జిల్లా ప్రధాన కార్యదర్శి మోట చక్రవర్తి,ఏపీ వైఎస్ఎస్‌వైఎస్ ప్రెసిడెంట్ కందరకొండ రమేష్ పాల్గొన్నారు.

బాపట్ల పురపాలక సంఘానికి బుల్‌డోజర్,మూడు ట్రాక్టర్లు

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల పురపాలక సంఘం ద్వారా నూతనంగా కొనుగోలు చేసిన బుల్ కంపెనీకి చెందిన బుల్‌డోజర్,మూడు కొత్త ట్రాక్టర్లు సోమవారం పురపాలక కార్యాలయంకు చేరుకున్నాయి. మునిసిపల్ కమీషనర్ జి.రఘునాథ రెడ్డి పరిశీలించారు.సాధ్యమైనంత త్వరలోనే వాటిని పట్టణ పారిశుద్ధ్య పనుల నిమిత్తం అందుబాటులోకి తీసుకొస్తామని మునిసిపల్ కమీషనర్ తెలిపారు.

సావిత్రిబాయి పూలే వర్ధంతి

విశాలాంధ్ర - అద్దంకి : భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి కార్యక్రమాన్ని ఏపీ ఎస్సీ,ఎస్టీ బీసీ మైనారిటీస్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం స్థానిక చైతన్య బదిరుల ఆశ్రమ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్షులు జ్యోతి రమేష్ బాబు,విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, చెన్నుపల్లి నాగేశ్వరరావు,పాఠశాల చైర్మన్ పూనూరు ఆరోగ్యం తదితరులు పాల్గొన్నారు.

22 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

- ఉప విద్యాశాఖ అధికారి సురేష్

విశాలాంధ్ర - రేపల్లె : ఈనెల 17వ తేదీ నుండి 31వ తేదీ వరకు జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు రేపల్లె నియోజకవర్గంలో 22 పరీక్షా కేంద్రాలు 3351 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని బాపట్ల జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కే.సురేష్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపల్లె పట్టణంలో నాలుగు కేంద్రాలు రూరల్‌లో మూడు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.మొత్తం 22 పరీక్షా కేంద్రాలు,3351 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని ఆయన తెలిపారు.

బాధితులకు కుటుంబానికి న్యాయం చేయండి

విశాలాంధ్ర - బాపట్ల : ఆధారాలు ఉన్నా పోలీసులు కాలయాపన చేస్తున్నారని బాధితులకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నరసయ్య మాదిగ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ ప్రఖర్‌జైన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది నవంబర్ నెలలో పర్చూరు మండలం పోతకట్ల గ్రామంలో కోట చైతన్యను అదే గ్రామానికి చెందిన బీసీ కులానికి చెందిన కొందరు ఒక ఫోన్ కాల్ వివాదంలో అసభ్య పదజాలంతో బూతులు తిట్టి అవమానకరంగా బాధించగా మనస్థాపానికి గురై పురుగుమందు సేవించి అదే నెల 28వ తేదీన గుంటూరు జీజీహెచ్‌లో మరించారని తెలిపారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్ పోస్టు పోలీసులకు నన్ను మానసికంగా బూతులు తిట్టడం వల్లనే నేను మనస్థాపానికి లోనై పురుగుమందు తాగి చనిపోవాలని నిర్ణయించుకున్నారని మరణ వాంగ్మూలంలో తన మరణానికి కారణమైన వారి పేర్లని స్పష్టంగా చెప్పడం జరిగిందన్నారు. మూడు నెలల నుండి పర్చూరు పోలీస్ స్టేషన్ సబ్ ఇనిస్పెక్టర్ తాత్సారం చేస్తూ జాప్యం చేయడం జరిగిందన్నారు.బాపట్ల డిఎస్పీని సంప్రదించగా రిపోర్టుల పేరుతో సరైన విచారణ చేయకుండా మరింత సమయాన్ని వృధా చేస్తున్నారని తక్షణమే సంబంధిత అధికారులను ఆదేశించి కేసుని ఎస్సి,ఎస్టి అట్రాసిటీ కేసుగా నమోదు చేసి చర్యలు తీసుకొని కేసు బాధితులకు కుటుంబానికి న్యాయం చేసేలా చూడాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఆర్ పి ఎస్ నాయకులు దుడ్డు వందనం మాదిగ, బాపట్ల పట్టణ అధ్యక్షులు తాళ్లూరు రాజేష్ మాదిగ,పాగాల జాన్ ధూపాటి వెంకటేష్ , పందిల డేవిడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ను కలసిన రమణారెడ్డి

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ను సోమవారం దోర్నాల మండల కన్వీనర్ గంట వెంకట రమణారెడ్డి మరియు వైసీపీ గ్రీవెన్స్ నాయకుడు వెన్న వెంకటేశ్వర్ రెడ్డి, ఏఐటి యూసి నాయకుడు షేక్షావలి, మరియు వైసీపీ నాయకులు వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ను శాలువాలతో, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా దోర్నాల వైసీపీ మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి , తనపై నమ్మకంతో రెండవసారి దోర్నాల మండల కన్వీనర్‌గా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్టీ కోసం కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గొలమారు శేఖర్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, మరియు వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

విశాలాంధ్ర - సింగరాయకొండ : ప్రకృతివ్యసాయ పద్ధతులలో ఎటువంటి రసాయన పురుగు మందులు లేకుండా పండించిన కూరగాయలతో కేంద్ర మండలం సింగరాయకొండ పరిధిలోని మండల రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా తాసిల్దార్ రవి ఎంపీడీవో జయమణి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి ఎక్కువ లాభాలు గడిస్తారని రైతులు ఎలాంటి పద్ధతులను అవలంబించాలని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో పండించిన పంటలు ప్రతి సోమవారం ఇదేవిధంగా స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, కనుక ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతమైన కూరగాయలు, ఆకుకూరలు పండ్లు తీసుకొవడం వల్ల మన ఆరోగ్యం కాపాడు కోగలమని తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు తాసిల్దార్,ఎంపీడీఓ,తోపాటు అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ ఏ డి ఏ నిర్మల, ఎం ఏ ఓ సుదాకర, మండల సమాఖ్య ఏపీఎం బాగ్యలక్ష్మి, మరియు ప్రకృతివ్యసాయ సిబ్బంది మండల ఇంచార్జ్ ఏ వెంకటరమణ,ఐసీపీస్ హాజరైన ఆకుకూరలు, కూరగాయలు కొనగోలు చేయడం జరిగింది.

12న 'యువత పోరు' జయప్రదం చేయండి

మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్: రాష్ట్రంలో విద్యనభ్యశిస్తున్న విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని మార్కాపురం నియోజకవర్గ ఇన్చార్జి. మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం వైయస్సార్సిపి పార్టీ కార్యాలయంలో ఈనెల 12న కలెక్టరేట్ వద్ద జరిగే వైయస్సార్ యువతపోరు వాల్ పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 త్రైమాసికాలుగా విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయంబర్స్‌మెంట్ , వసతిదీవెన కింద చెల్లించాల్సిన 4600 కోట్ల బకాయినిధులను విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలన్నారు. ఎన్నికల మానిఫెస్టోలో చెప్పిన విధంగా నిరుద్యోగ యువతకు నెలకు 3వేల భృతి ఇవ్వాలని, కొత్త మెడకల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని, పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులో ఉంచాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు, వైయస్సార్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద జరిగే కార్యక్రమానికి పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్, ఏపి పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యులు వెన్న హనుమారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ ఇస్మాయిల్, వైస్ ఛైర్మన్ 2 అంజమ్మ శ్రీనివాసులు, రాష్ట్ర బూత్కమిటీ కార్యదర్శి పత్తి రవిచంద్ర, మాజీ ఎమ్సి ఛైర్మన్ జి శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కంది ప్రమీలారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జడ్పీటిసిలు నారు బాపన్రెడ్డి, అక్కిదాసరి ఏడుకొండలు, కొనకనమిట్ల యంపిపి మురళీకృష్ణయాదవ్, మండలపార్టీ కన్వీనర్ శంకర్రెడ్డి, లయోల చెంచిరెడ్డి, దుర్గాబాస్కర్, నాయకులు బట్టగిరి తిరుపతిరెడ్డి, కె సుబ్బారెడ్డి, జి శ్రీనివాసులు, రామచంద్రారెడ్డి, తర్లుపాడు మండల పార్టీ అధ్యక్షులు మురారి వెంకటేశ్వర్లు, రామనారాయణరెడ్డి, కౌన్సిలర్లు ఎం శ్రీనివాసులు, బుశ్శెట్టి నాగేశ్వరరావు, చదలవాడ రమణారెడ్డి, మందటి మహేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటిసి రంగారెడ్డి, నజీర్, సోషల్మీడియా రఫీ. వైయస్సార్సిపి దివ్యాంగుల విభాగం జిల్లా ఆధ్యక్ష కార్యదర్శులు డి గోపాల్రెడ్డి, నుసుం బాలచంద్రుడు, పోరుమామిళ్ల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రమణయ్య సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-మార్కాపురం : పశ్చిమ ప్రకాశంలో తొలితరం పాత్రికేయులు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ఓవీ రమణయ్య సేవలు మరువలేనివని మాజీ శాసనసభ్యులు జంకె వెంకటరెడ్డి అన్నారు. ఓవీ రమణయ్య 35వ వర్ధంతి ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో అధ్యక్షులు డి మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జంకె మాట్లాడుతూ ఓవీ రమణయ్య కుటుంబంతో మాకు అనేక దశాబ్ధాలుగా సుదీర్ఘ సాన్నిహిత్యం ఉందని అన్నారు. అటు ప్రజలకు ఇటు ప్రభుత్వానికి పాత్రికేయులగా ఓవీ రమణయ్య వారధిగా నిలిచారని అన్నారు. స్వాతంత్ర్య సమర యోధులుగా పాత్రికేయులుగా, రచయితగా తుదిశ్వాస వరకు ప్రజా పక్షాన పోరాటం చేసిన రమణయ్య ఆశయాలకు అనుగుణంగా నేటితరం జర్నలిస్టులు ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఓవీ రమణయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యుజే జిల్లా అధ్యక్షులు ఎన్‌వి రమణ, వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, ఓవీ రమణయ్య కుమారుడు ఓవీ మల్లిక్, ఏపీయూడబ్ల్యుజే సీనియర్ నాయకులు అల్లూరిరెడ్డి, జీఎల్ నరసింహారావు, కేవీ సత్యనారాయణలు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-సిఎస్‌పురం : మండలంలోని నల్లమడుగుల గ్రామానికి చెందిన పాతురి వెంకటరెడ్డి సుశీల ఎంపీపీ ఎస్ నల్లమడుగుల పాఠశాల అభివృద్ధి కోసం టాయిలెట్స్ నిర్వహణలో భాగంగా ఓవర్ హెడ్ ట్యాంక్ మరియు మోటార్ హ్యాండ్ వాష్ నిర్మాణము కోసం తమ సొంత నిధులు దాదాపు 40 వేల రూపాయలతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా

వారికి మండల పరిషత్ ఎంఈఓ ప్రసాదరావు వారిని అభినందించారు. అలాగే గ్రామస్తులు అందరూ కలిసి పాఠశాల అభివృద్ధి కి సహకరించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హమ్మద్ ఉపాధ్యాయురాలు అనురాధ సీఆర్‌పి మహేష్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు నీటి కుంటలు ఎంతో ఉపయోగం

- డ్వామా విజిలెన్స్ అధికారి జాన్సీ రాణి

విశాలాంధ్ర - తాళ్లూరు: రైతులకు నీటి కుంటలు (ఫామ్ పాండ్స్) ఎంతో ఉపయోగకరమైనవని డ్వామా విజిలెన్స్ అధికారి జాన్సీ రాణి అన్నారు. మల్కాపురం, దోసకాయల పాడు పంచాయితీ పరిధిలో రైతులు తవ్వుతున్న ఫామ్ ఫాండ్స్‌ను ఆదివారం పరిశీలించారు. రైతులకు, ఉపయోగకరంగా ఉండాలని జిల్లా విజిలెన్స్ పర్యవేక్షకులు వెంకటస్వామి సూచించారు. ఎపీఓ మురళి, ఈసీ గురుబాబు , రమేష్, శ్యాంసన్‌లు పాల్గొన్నారు.

డీఎస్సీ కోచింగ్‌లో ఉచిత శిక్షణ

విశాలాంధ్ర - ఒంగోలు టౌన్: డీఎస్సీ -2025 పరీక్షలకు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆన్ లైన్ లో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి ఎం అంజల తెలిపారు. బీసీ మరియు ఈడబ్యు ఎస్ (ఈబీసీ) అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు తమ టెట్ లో వచ్చిన మార్కులు, కుల, ఆధాయ దృవీకరణ పత్రం జిరాక్స్ లు,, రెండు పాస్ పోస్ట్ సైజు ఫోటోలతో బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజెయ్యాలని కోరారు. పూర్తి వివరాలకు ఎపీ బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయం ఫోన్ నంబర్ 08592-231232ను సంప్రదించాలని కోరారు.

టీమ్ ఇండియాకు శుభాకాంక్షలు

ప్రముఖ వ్యాపారవేత గంట రమణయ్య

విశాలాంధ్ర-పామూరు రూరల్ : న్యూజిలాండ్ క్రికెట్ జట్టుతో ఉత్కంఠ పోరులో ఉద్రూతలూగించే గెలుపులో నువ్వా నేనా అంటూ క్రికెట్ యుద్ధంలో విజయం సాధించిన టీమ్‌ఇండియా జట్టుకు ప్రముఖ వ్యాపారవేత్త గంట రమణయ్య శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం దుబాయ్ వేదికగా జరిగిన ప్రపంచ ఛాంపియన్స్ ట్రోఫీ -2025 లో భారత జట్టు సమిష్టి కృషితో ఆడి విజేతగా నిలిచిన టీమిండియా జట్టును గంట రమణయ్య అభినందించారు. ఫైనల్ మ్యాచ్ లో అద్భుతమైన ఆటతో టీమిండియా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన క్రీడాకారులను ఆయన ప్రశంసించారు. ఛాంపియన్స్ ట్రోఫీ -2025 ఫైనల్ లో న్యూజిలాండ్ పై విజయం సాధించి ఇండియా విశ్వ విజేతగా నిలిచిందని అన్నారు.

పూజా సామగ్రి వేలం

విశాలాంధ్ర - తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవానీ ఆలయం వద్ద దేవదాయ శాఖ ఆధ్వర్యంలో పూజా సామగ్రి విక్రయించే హక్కు కోసం వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఈవో జి వాసు బాబు తెలిపారు. తిరునాళ్లు రెండు రోజులు మినహా యించి 2025 ఏప్రియల్ ఒకటి నుండి 2026 మార్చి 31 వరకు ఈ హక్కులు ఉంటాయని చెప్పారు. ఈనెల 17న బహిరంగ వేలం మధ్యాహ్నం మూడు గంటలకు ఉంటాయని చెప్పారు. అమ్ముకొని హక్కు కోసం రూ. 50వేలు, కొప్పల చిప్పల ప్రొగు కోసం 25వేలు, తిను బండారాలు, హెూటల్ నడుపుకు నేందుకు 25 వేలు డిపాడిట్ చెల్లించాలని చెప్పారు.

అర్జీలు పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో వచ్చిన అర్జీలపై ప్రజలు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన ఆర్జీలను ప్రభుత్వం విధించిన గడువులోగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.రెవిన్యూ సదస్సుల్లో ప్రజల నుండి వచ్చిన అర్జీలను వారంలోగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.జిల్లాలో వ్యవసాయ పంటల కోతలు పూర్తయినందున జిల్లాలో నీటి పన్ను వసూలు చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు.జిల్లాలో పి4 సర్వేను వేగవంతంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. పిఆర్ కోడ్ ప్రతి ఒక్కరు స్కాన్ చేసి సంబంధిత వివరాలను పూర్తి చేయాలని ఆయన చెప్పారు. ప్రభుత్వ సర్వేల నమోదులో వేటపాలెం మండలం వెనుకబడి ఉందని ఆయన అధికారులకు చెప్పారు.ప్రభుత్వ దాతల ప్రజల భాగస్వామ్యం పి4తో ప్రతి ఇంటికి అభివృద్ధి జీవితానికి ప్రగతి వాల్ పోస్టర్లను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ స్వయం సహాయక సంఘాల ద్వారా సైనిక వెల్ఫేర్ ఫండ్ కోసం సేకరించిన రూ.10.30 లక్షల రూపాయల చెక్కును జాయింట్ కలెక్టర్‌కు అందజేశారు.సైనిక్ వెల్ఫేర్ ఫండ్ కోసం కృషి చేసిన డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను ఏపీఎంలు ఏసీలను జాయింట్ కలెక్టర్ సన్మానించారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్,బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా,సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగిరెడ్డి,జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మజ,డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ,జిల్లా రవాణాశాఖ అధికారి పరంధామ రెడ్డి,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ,జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్ష ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరణ

విశాలాంధ్ర - బాపట్ల : డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్ పరీక్షలకు ఆన్లైన్ ద్వారా ఉచిత శిక్షణ కొరకు అర్హులైన బాపట్ల జిల్లాకు చెందిన బీసీ,ఈబీసీ కులములకు చెందిన అభ్యర్థుల నుండి దర ఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.అభ్యర్థులు దంఖాస్తులు 10వ తేది నుండి వెనుకబడిన తరగతుల సంక్షేమం ,సాధికారిత అధికారి వారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఉచిత ఆన్లైన్ శిక్షణ కొరకు టెట్ పరీక్ష క్వాలిఫై అయిన అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. టీటీసి మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.ఎంపిక కాబడిన అభ్యర్థులకు ఉచిత ఆన్లైన్ శిక్షణా నిర్వహించబడునన్నారు.అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు 10వ తరగతి,టీటీసి మార్కుల లిస్ట్,టెట్ మార్కుల లిస్టు,కుల ,ఆదాయ ధృవీకరణ పత్రం (తల్లి దండ్రుల వార్షిక ఆదాయం రూ.1,00,000 లోపు మాత్రమే), ఆదార్,బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్,2 పాస్ పోర్ట్ సైజు ఫోటోలు జతపరిచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరములకు ఫోన్ నెంబర్ 9866251789,6309335544 వెనుకబడిన తరగతుల సంక్షేమం,సాధికారిత అధికారి వారి కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

అవయవదానంపై అవగాహన అవసరం

ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

విశాలాంధ్ర - బాపట్ల : అవయవ దానంపై అవగాహనతో ముగ్గురి ప్రాణాలు నిలబెట్టిన వరలక్ష్మి మరణంలోను జీవించే ఉంటారని ఆమె బాపట్ల ప్రాంత వాసి కావటం గర్వకారణంగా ఉందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అన్నారు.బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందిన బాపట్ల వివేకానంద కాలనీకి చెందిన మహిళ కొపనాతి వరలక్ష్మి మృత్యువుతో పోరాడి అలసిపోయారన్నారు.బతికే అవకాశం లేని విషాదకరమైన సమయంలో వరలక్ష్మి కుటుంబం తీసుకున్న సాహసోపేతమైన అవయవదానం ముగ్గురి ప్రాణాలు నిలబెట్టడం ఎంతో సంతోషంగా ఉన్నా,వరలక్ష్మి కన్నుమూ యటం కలచి వేస్తుందని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు అన్నారు.అచేతనావస్థలో ఉన్నా మరొకరి ప్రాణాలు నిలబెట్టగలిగితే అంతకంటే గొప్ప విషయం మరొకటి ఉండదన్నారు. చనిపోయినా మరొకరిలో జీవించే వరాన్ని ప్రసాదించటం కొద్ది మందికి మాత్రమే అటువంటి అవకాశం దక్కుతుందన్నారు. మరణం నుంచి జననంలోకి వచ్చి ఎందరికో పునర్జన్మనివ్వటం ఒక మహా సంకల్పంగా నిలిచిపోతుందని నరేంద్ర వర్మ అన్నారు.

ఇటువంటి మహా దాన మైన అవయవదానంలో వరలక్ష్మి కుటుంబం తీసుకున్న ఈ నిర్ణయం ప్రతి ఒక్కరిలో స్ఫూర్తి నింపాలన్నారు.అవయవదానంపై అవగాహన పెరగాలన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : వేసవికాలం సమీపిస్తున్న దృష్ట్యా నిజాంపట్నం పంచాయతీ పరిధిలోని ప్రజలు నీటికి ఇబ్బందులు పడకుండా నిజాంపట్నం పంచాయతీ కార్యదర్శి మోడి శ్రీనివాసరావు ముందస్తు చర్యలు చేపట్టారు.దీనిలో భాగంగా నిజాంపట్నం పంచాయతీలోని దర్వేష్‌పాలెం వద్ద ఉన్న రెండు గుండం చెరువులకు మోటార్లను ఏర్పాటు చేసి నీటిని నింపుతున్నా రు.దీంతో ఆ చెరువులు జలకళను సంతరించుకున్నాయి.వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పంచాయతీ పరిధిలోని ప్రజలందరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని పంచాయతీ కార్యదర్శి మోడి శ్రీనివాసరావు సూచించారు.

పేద మహిళకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మండలంలోని అడవి పంచాయితీ,కృపానగర్ గ్రామంలో అనారోగ్యం బాధపడుతున్న ఏరిపిలి రమణమ్మకి అరుణాచలేశ్వర ఆర్గనైజేషన్ సభ్యులు ఆర్థిక సహాయం సోమవారం అందజేశారు.గత ఐదు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతుందని వైద్యం చేయించుకోవడానికి కూడా డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని అరుణాచలేశ్వర ఆర్గనైజేషన్ దృష్టికి కుటుంబ సభ్యులు తీసుకు వచ్చారని అసోసియేషన్ సభ్యులు కొండపాటూరు అనిల్ కుమార్ తెలిపారు.అనారోగ్యంతో మంచాన పడి ఉండటం వల్ల ఆసుపత్రుల చుట్టూ తిరిగి ఉన్న డబ్బులన్నీ అయిపోయి మందులు తీసుకోవటానికి కూడా డబ్బులు లేక గత నెలలో మందులు కూడా తెచ్చుకోలేని పరిస్థితుల్లో ఉన్న వారి కుటుంబం గురించి గోగు శివ అరుణా చలేశ్వర ఆర్గనైజేషన్ వారి దృష్టికి తీసుకురాగా అరుణా చలేశ్వర ఆర్గనైజేషన్ సభ్యులు అందరూ కలిసి వారికి మందుల ఖర్చు నిమిత్తం ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు.విషయం తెలుసుకున్న వెంటనే స్పందించి బాధితురాలుకి మందుల నిమిత్తం రూ.5 వేలు అందించినందుకు అరుణాచలేశ్వర ఆర్గనైజేషన్ సభ్యులందరికీ కృపానగర్ గ్రామ కమిటి సభ్యులు గోగు శివ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొండపాటూరు గోపి,షేక్ అఫ్జల్,షేక్ ఇబ్రహీం, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

నిర్దిష్ట గడువులోపు అర్జీలను పరిష్కరించాలి

- ఎస్పీ తుషార్‌డూడి

విశాలాంధ్ర - బాపట్ల : నిర్దిష్ట గడువులోపు చట్ట పరిధిలో అర్జీలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి జిల్లా పోలీస్ అధికారులను ఆదేశించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా ఎస్పీ నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదీదారులు వారి వ్రాతపూర్వకమైన అర్జీలను అందజేసి స్వేచ్ఛగా తమ సమస్యలను విన్నవించుకున్నారు.ఫిర్యాదీదారులు ఇచ్చిన అర్జీలను స్వయంగా స్వీకరించి,వారి అర్జీలను పరిశీలించి,చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరిస్తామని అర్జీదారులకు జిల్లా ఎస్పీ భరోసా కల్పించారు.సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోపు చట్ట పరిధిలో విచారించి పరిష్కరించాలన్నారు.పోలీస్ స్టేషన్‌లకు, కార్యాలయాలకు వివిధ సమస్యలపై వచ్చే అర్జీదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు.అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఆదేశించారు.అర్జీల పరిష్కారం కోసం తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను పోలీస్ ప్రధాన కార్యాలయంలోని పిజిఆర్ఎస్ సెల్‌కు పంపాలన్నారు.ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు.జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సోమవారం కుటుంబ కలహాలు,అత్తారింటి వేధింపులు, ఆస్థి తగాదాలు,భూ వివాదాలు,ఆర్థిక లావాదేవీ మోసాలు,ఇతర పలు సమస్యలతో మొత్తం 89 అర్జీలు వచ్చాయి.ఈ కార్యక్రమంలో బాపట్ల డిఎస్పి రామాంజనేయులు, పిజిఆర్ఎస్ సెల్ ఎస్సై శ్రీనివాస్ ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

విశాలాంధ్ర దినపత్రికకు బాపట్ల జిల్లాలో దిగువ పేర్కొన్న ప్రదేశాలల్లో పనిచేయుటకు విలేకరులు కావలెను

ఇంటర్మీడియట్ చదివి తెలుగు భాషా పరిజ్ఞానం కలిగి సామాజిక, రాజకీయ అంశాలపై అవగాహన ఉన్న వ్యక్తులు అర్హులు

పనిచేయవలసిన ప్రదేశాలు : బాపట్ల మున్సిపాలిటీ, బాపట్ల జిల్లా క్రైమ్, బాపట్ల కలెక్టరేట్, బాపట్ల రూరల్, చీరాల మున్సిపాలిటీ,చీరాల టౌన్, అద్దంకి మున్సిపాలిటీ, అద్దంకి టౌన్, అద్దంకి రూరల్, పర్చూరు రూరల్, పర్చూరు టౌన్, రేపల్లె మున్సిపాలిటీ, రేపల్లె టౌన్, రేపల్లె రూరల్, వేమూరు టౌన్, వేమూరు రూరల్, అమర్తులూరు, భట్టిప్రోలు, నగరం, చుండూరు, చిన్నగంజాం, జె.పంగులూరు, సంతమాగులూరు, కారంచేడు.

గమనిక : ఆయా ప్రదేశాలల్లో స్థానికులై ఉండాలి

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 9618198627

విశాలాంధ్ర జిల్లా కార్యాలయం, సిబిజెడ్ చర్చి వెనుక, శృంగారపురం, బాపట్ల